# పితృహృదయం

మహేశ్వర్

●

●

నసీమియా సాయిబు నన్ను తొలిసారి చూసిన చూపులో ఓ సన్నిహిత ఆప్తుని చూసినవాడి మల్లే ఖుషీ ఐనాడని, అతని కళ్ళల్లోని ప్రేమ స్పష్టంగా చెప్పింది. నాలో తన ఆప్తుణ్ణి చూసేడో లేక ఊహించేడో— "బాబూ మీది టా—టా—కదూ?" అని ప్రశ్నించేడు.

ఆ ప్రశ్నలో నసీమియా ప్రేమపూరిత నయనాలు అశ్రుపూరితాలైనాయ్.

"నాదీవూరే!" అన్నాను.

"అంతే—మరేంలేదు వెళ్ళిపోండి—" నసీమియా అన్నాడే కాని, ఇంకా ఆశమాత్రం కళ్ళని విడిపోలేదు.

"నువ్వు ఎవర్నో చూసి నేనే అనుకుని పొరబడుతున్నావ్. నీకు సంబంధించిన వాళ్ళెవరైనా టా—టా లో ఉన్నారా?" అనడిగేను.

"ఎవరూ లేరు లెండి—" అన్నాడు. ఇంకా ఆశలుమాత్రం పోలేదన్నట్టుగా చూసి వెళ్ళిపోయేడు.

మళ్ళా నెల్లాళ్ళదాకా నాకంట బడలేదు నసీమియా!

ఓసారి సాయంత్రం చీకటి చీకటి పడుతూండగా చెరువుగట్టున నసీమియా సాయిబు దృష్టి నుండి తప్పించుకు పోలేకపోయేను.

"బాబూ ఒక్కమాటంటాను కోపం తెచ్చుకోరుకదూ?" అన్నాడు.

"ఏం-చెప్ప" అన్నాను.

"ఒకే ఒకచక్కని కొడుకున్నాడు. అచ్చంగా మూడు మూర్తులా మీలానే ఉంటాడు. ఇద్దరికీ ఏమీ భేదంలేదు. కావలిస్తే వాడి ఫొటో తెస్తాను చూడండి. వాడుకూడా కొద్దో, గొప్పో ఇంగ్లీషు, తెలుగు చదువుకున్నాడు.

ఇప్పుడు టా—టా—లో పని చేస్తున్నాడు. నెలరోజులైఉత్తరం కూడా రాలేదు. గుండెలో బరువుగా ఉంది—" అని మరి మాట్లాడలేక పోయేడు.

"పోనీలే నన్ను రోజూ చూస్తూంటావ్ కదూ, నన్ను చూసినప్పుడల్లా నీ కొడుకుని చూసిన తృప్తి పడ్తూవుండు"

అని ఆగకుండా వెళ్ళిపోయేను.

వెంటనే బుర్రలో ఎన్నో ఆలోచనలు చెలరేగినై! ఈ నసీమియా సాయిబు ఎవడు?? చిల్లంగి దేవతనారాధించే ఒకానొక దుర్మార్గుడుకాడూ? ఖాదర్ సాయిబు నాతో ఎన్నోసార్లు చెప్పేడు. తన కొడుకుని పీర్ల సంబరంలో ఆడుతూ పాడుతూ ఈ నసీమియాగాడే చిల్లంగిపెట్టి చంపేశాడని-!

కొంపతీసి నన్నుకూడా ఆ చిల్లంగి దేవత కప్పగించడు కదా?!

కాని నసీమియా కళ్ళలో ఆ క్రూరత్వంగాని రాక్షసత్వంగాని కానరాదే!

ఏమైనాసరే ఆ దారంట మరి నడవలేదు గనుక నసీమియా కనబడలేదు.

సుమారు ఆరుమాసాలానంతరం ఆ తొలిదారంట మళ్ళా నడుస్తూండగా మళ్ళా ఒకనాటి సాయంత్రం అదేవేళకి నసీమియా కనబడ్డాడు?"

"బాబూ ఒక్కసారి మాయింటికి రాదూ?" అని, ఎంతో దీనంగా అడిగేడు.

"ఇప్పుడు కాదులే నసీమియా,

* నేడే "శ్రీవిన్ ఆమ్ల" తలనూనె వాడుటకు ప్రారంభించండి. *

చీకటి పడిపోతోంది, రేపుఉదయాన్ని తప్ప కుండా ఒస్తాను.'' అన్నాను.

"నేనండీ, నసీమియానికాను అతని తమ్ముణ్ణి బుడిమియాని, ఇద్దరం ఒక్కలాగే అగుపడతాం— మా అన్న నాల్గు మాసాలనుండి మనోవ్యాధితో మంచాన్న పడ్డాడు- మిమ్మల్ని చూస్తానని కలవరిస్తు న్నాడు-ఒక్కసారొచ్చి చూసిపోరూ?'' అన్నాడు.

"నసీమియా శాంతియుత నేత్రాలు నన్ను రమ్మంటున్నై- కాని చిల్లంగిదేవత జ్ఞాపకాని కొచ్చి కాళ్లు వెనకాడుతున్నాయ్—

ఎలాగో ధైర్యంచేసి నసీమియా యింటికి వెళ్ళేను. నసీమియా చిక్కి శల్యమై మంచానికంటుకు పోయేడు.

మళ్లా స్ఫురణకొచ్చింది: చిల్లంగిదేవత తన కెవ్వర్నీ ఒప్పచెప్పకపోతే, తనని ఆరాధించిన వాళ్ళనే ఆరగిస్తుందట:

భయపడ్తునే మంచం దగ్గర కెళ్లేను-నసీమియా కళ్ళల్లో మునుపటి ప్రేమ, శాంతి ఆశ, నసించి పోయేయి—

"ఏం—నసీమియా అలావున్నావ్?''

"ఏంలేదు—ఈ లాడు తింటారూ?'' అని తల కిందనుండి ఓ చిన్నలాడూ తీసి యిచ్చేడు.

చేత్తో అందుకున్నాను గాని నోట్లో పెట్ట లేదు.

"నామీద కోపం వచ్చింది కదూ?''

"లేదు-''

"మరైతే తినరేం?''

మళ్ళా నసీమియా కళ్ళల్లో నిరాశ, అశాంతి చూడలేక లాడూ ఉండ తినేసేను—

"మాయింట్లో ఇవాళ ఉండరాదూ?''

"మళ్ళా రేపొస్తాలే-డాక్టర్ని పంపిస్తాను-'' అనిలేచి చక్కా వచ్చేసేను.

ఇప్పుడు నసీమియాని చూచినప్పుడల్లా నాలో యిదివరకున్న భీతావహం అధైర్యం అన్నీ నసించినై —నసీమియాకొరకేమైనా చేస్తాను. ఈ మార్పు నసీమియాలో కలిగిందా?? నాలోకలిగిందా??

* * *

ఉదయాన్నే కాఫీతాగి నసీమియాని చూడ్డా నికి బయల్దేరేను.

ఒకానొక అనిర్వచనీయమైన ప్రేమానురాగాలు యేర్పడ్డాయ్ నసీయామికి నాకూ మధ్య. సుమారు పదిగంటలౌతుంది. ఇంతస్థూలకాయుడు కూడ శవంలా తయారయేడు నసీమియాకి స్పృహతప్పి పోయింది.

మెల్లిగావెళ్ళి మంచంమీద కూర్చున్నాను. నసీమియా తలనిమురుతూ – తలదగ్గరవున్న పార్శిలు చూసి యేమిటనడిగేను బుడీమియాని,—

కన్నీళ్ళతో తెరచి చూపించేడు పార్శిలు – అందులో కొన్నిబట్టలూ, నసీమియా కొడుకు సలీమియాఫొటో వున్నై – ఆతృతగా ఫొటోతీసి చూసేను. అదిఫొటో? కాదు అద్దం – అద్దంలో నాముఖం స్పష్టంగా కనబడుతుంది—

"మా అన్నకొడుకు సలీమియాఫొటో టాటా ఫ్యాక్టరీలో చనిపోయేడు-'' అన్నాడు బుడీమియా—

ఇది అద్దంకాదూ?! నిజంగాఫొటో నా ఫొటోనే యెత్తుకొచ్చియేదో నాటకం ఆడుతున్నారు కల్లు – నులుపుకుచూచేను – ఆలోచించేను – నేనస లెప్పుడూ ఫొటోయే తీయించుకోలేదు—

అప్రయత్నంగా కన్నీళ్లుజారి నసీమియా హృదయాన్ని తడిపేయి. దాంతో నసీమియాకి తెలి వొచ్చింది. గట్టిగా ఒక్కఅరుపు అరచేడు.

* "శ్రీవిస్ అమ్మ" తలనూనె శ్రేష్టమయినది. *

"అల్లాహో అక్బర్!" అని - ఆ అరుపులో మృత్యుదేవత తాండవమాడింది - నన్ను గట్టిగా కౌగలించుకుని తమ్ముడు బుడీమియాని పిలచి :

"దుర్మార్గుడా - నా కొడుకు బతికుండగానే టా-టాలో పోయేడని నన్ను మభ్యపెట్టి, నా కొడుక్కి చిల్లంగి పెట్టాలని... చూచేవు... నీను..."

మరి మాట్లాడలేక పోయేడు - నసీమియా శాంతియుతంగా కళ్ళుమూసేడు—

నసీమియాని చిల్లంగి తినేసిందని వూరంతా ప్రాకిపోయింది.

"మరి ఆదేవతకి యెవ్వర్నీ యివ్వకపోతే యేంచేస్తుంది - వుపాసకుణ్ణే 'ఉస్వాహా' చేసింది. మరి నాకొడుకుని చంపేసినప్పుడో?" అని అట్టహాసం చేసేడు ఖాదర్ సాయిబు.

"నీ కొడుక్కి చిల్లంగి పెట్టినవాడు నసీమియా కాదు - అతనితమ్ముడు బుడీమియా - యెందర్నో చిల్లంగికి బలియిచ్చి, ఆఖరికి అన్ననుకూడ బలిచ్చేడు దుర్మార్గుడు—

సమాధిలో నసీమియాకి, అతని పుత్రుడు సలీమియాకి ఆత్మశాంతి కావాలని నమాజు చెయ్-' అన్నాను.

"ఆఁ... అంటూ వుండిపోయేడు ఖాదర్ సాయిబు—




ముద్దులొలుకు ముచ్చటైన తలకట్టు!

'కోలా' కురుల్లకు, తలవెండ్రుకలకు బలమునిచ్చి నిగనిగలాడు నల్లని నిడుపాటి తల వెండ్రుకలను దట్టముగ పెంచును.

తలవెండ్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేనుకొరుకు మొదలైన తలవెండ్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులను నిర్మూలించును.

వ్యాధులవల్లగాని, ప్రసవమువల్లగాని రాలిపోయినతలవెండ్రుకలను తిర్గి సృష్టించుటలో 'కోలా' సమర్థతగల తలనూనె.

సుప్రసిద్ధ ఆంధ్ర, అరవ, కర్ణాటక సినిమా తారలచే వొక్కటేవిరివిగా వాడబడుచున్నది నేటినుంచి మీరుకూడా 'కోలా'ను వాడండి. 'కోలా' వర్తకులందరివద్దనూ దొరకును. వెల రూ. 0—14—0.

కోలా వుపయోగించి రు. 500/-లు బహుమతులు పొందండి!

సోల్ డిస్ట్రిబ్యూటర్సు :—
ది విజయా ట్రేడింగు కంపెని, బెజవాడ.

"కోలా" హెయిర్ టానిక్